దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాన్నిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న అన్ని సమస్యలకూ దశలవారీగా పరిష్కారం చూపుతామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను వివరించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ... అన్ని రంగాలలో గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా మార్చాలనే సంకల్పంతో పనిచేద్దామని సూచించారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా చేయాలని, అవసరమైన చోట మంచినీటి సరఫరా సమయం పెంచేలా చూస్తామన్నారు. బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్, నాయకులు జలేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వినోద్, అశోక్‌గౌడ్, యాదగిరి, వినోద్‌రావు, నకుల్, దొరబాబు, శేఖర్, ప్రసాద్, సుమన్, ప్రకాశ్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ సంబురం



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని గిరిజ మార్వెల్, వేమన రెడ్డి కాలనీలలో బతుకమ్మ పండుగ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కాలనీ మహిళలతో బతుకమ్మ పాటలు పాడి, ఆటలు ఆడారు. అనంతరం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులు అంతా సంబురంగా జరుపుకొనే వేడుక, బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతి ఆరాధిస్తూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. ఇదో పువ్వుల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, తొమ్మిది రోజుల పాటు ఆడి పాడి గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి తెలంగాణకే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగన్నారు. గిరిజ మార్వెల్ అపార్ట్‌మెంట్, రెడ్డి కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అలేఖ్యకు లాస్యసంజీవని బిరుదు ప్రదానం



అలేఖ్యకు బిరుదును ప్రదానం చేసిన డాక్టర్ శోభరాజు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో గురువారం నాదబ్రహ్మోత్సవ్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కమలాకర సంగీత నృత్య కళాక్షేత్రం గురువు గోరుకంటి మేఘన శిష్య బృందం పుష్పాంజలి తదితర అంశాలకు, ప్రఖ్యాత కీర్తనలకు నృత్యాంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. కళాకారిణి డాక్టర్ అలేఖ్యకు లాస్యసంజీవని బిరుదును ప్రదానం చేశారు. దేవనార్ ఫౌండేషన్ అధినేత సాయిబాబాగౌడ్, పద్మశ్రీ డాక్టర్ శోభరాజు పాల్గొన్నారు.



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని షోడశ రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు



కొత్తగూడలోని కట్టమైసమ్మ ఆలయంలో బాలా త్రిపురసుందరి దేవిగా...



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో బాలా త్రిపురసుందరీగా...

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకారం
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు
- సర్వాంగ సుందరంగా మండపాలు



గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో...

గచ్చిబౌలి/రాయదుర్గం: దేవీ శరన్నరవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలను ఒకరోజు ముందుగానే ప్రత్యేక అలంకారం చేశారు. మొదటి రోజైన గురువారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శివసాయిక్షేత్రంలో చండీపారాయణం, చండీహోమం వంటి ప్రత్యేక పూజలను హోమాలను నిర్వహించారు.

- జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను చేసి అమ్మవారిని మొదటిరోజైన గురువారం షోడశ రాజరాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారిని భవానీ దేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.
- రాయదుర్గంలోని ఊర పోచమ్మ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరి దేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, శ్యామ్‌లెట్ ఉపేందర్, జ్యోతి పర్యవేక్షణలో పూజలను నిర్వహించారు.
- కొత్తగూడలో మొదటిరోజు కట్టమైసమ్మ మహాలక్ష్మీ అమ్మవారిని బాలా త్రిపురసుందరి దేవీ అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు.



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని పెద్దమ్మ, మైసమ్మ అమ్మవార్లు

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వెంకటరమణ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా వెంకటరమణ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉప్పల్ సర్కిల్‌లో పనిచేసిన ఆయనకు శేరిలింగంపల్లి సర్కిల్ పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు పనిచేసిన డిప్యూటీ సిటీ ప్లానర్ మెహ్రాకు ఫలక్‌నామా సర్కిల్‌కు బదిలీ చేశారు. అదే విధంగా టీపీఎస్‌గా జిషాన్ విధుల్లో చేరారు.

పర్షియన్, సంస్కృత భాషలకు సమ ప్రాధాన్యం



సదస్సులో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: మొఘలులు పర్షియన్, సంస్కృత భాషలను సమానంగా ప్రోత్సహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్ర ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'చరిత్ర, ముస్లిం చరిత్రకారులు: భారతీయ దృక్పథం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని అభివృద్ధిలో అత్యంత ముఖ్యమైనది అక్షరాస్యతను విస్తరించడం, ప్రోత్సహించడమని గుర్తు చేశారు. మొఘల్ శకంలో ముఖ్యమైన సహకారాన్ని హైలైట్ చేశారు. చరిత్రకారుడు మన్నన్ ఆసిఫ్ పనితీరును ప్రస్తావిస్తూ 'తారీఖ్ ఏ ఫరిష్తా', 'ఐన్ ఏ అక్బరీ' వంటి పర్షియన్ సాహిత్యం భారతదేశాన్ని సహనం, బహుళ సాంస్కృతికత, సమ్మిళిత ప్రదేశంగా ఎలా సూచిస్తుందో వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఫహీమ్ అక్తర్ నద్వీ సంపాదకత్వం వహించిన ఇటీవలి సెమినార్‌ల ప్రొసీడింగ్స్‌ను ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ విడుదల చేశారు. ఇదిలావుండగా ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సెమినార్ పేపర్లను ప్రచురించమని డిపార్ట్‌మెంట్‌ను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ అతీఫ్ ఇమ్రాన్ ప్రసంగించారు. పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, చరిత్రకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితానికి విజ్ఞాన 'నవోదయం'

- 'కార్పొరేట్'కు దీటుగా జవహర్ నవోదయ విద్యాలయాలు
- ఉన్నత ప్రమాణాలు, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమం సొంతం
- 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 7
- 9వ, 11వ తరగతుల ఖాళీల భర్తీకి దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 30
- 2024-25వ విద్యా సంవత్సరానికి సీట్ల భర్తీకి చర్యలు ఆరంభం
- నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని రంగారెడ్డి జిల్లా జేఎన్‌వీ పరిపాలనా భవనం

రాయదుర్గం: గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల జీవితానికి విజ్ఞాన నవోదయంగా జవహర్ నవోదయ విద్యాలయాలు నిలుస్తున్నాయని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ వెల్లడించారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ... జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష కోసం, 9, 11వ తరగతుల్లో ఏర్పడిన సీట్ల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నామని, అర్హులైనవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతోపాటు ఉత్తమ విలువలు, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్య క్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ వంటి వాటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని వివరించారు. నవోదయ విద్యాలయం సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యను అందించడం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా జేఎన్‌వీలను కేంద్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. 6వ తరగతిలో ప్రవేశం, 9, 11వ తరగతులలో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులను కోరడం జరుగుతుందన్నారు. కొన్నేళ్లుగా దేశంలోని 8 రీజియన్లలో హైదరాబాద్ రీజియన్ సీబీఎస్ఈ ఫలితాల్లో, కో కరికులర్ ఆక్టివిటీస్‌లో విశేష ప్రతిభ చాటుతోందని గుర్తు చేశారు.



ప్రశ్న: జేఎన్‌వీలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులకు చివరి తేదీ ఎప్పుడు?

డీసీ: జేఎన్‌వీలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి అర్హులైన వారి నుంచి ఈ నెల 7వ తేదీలోగా చేసుకోవాలి. దరఖాస్తులు వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: జేఎన్‌వీలో 9, 11వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులకు చివరి తేదీ ఎప్పుడు?

డీసీ: జేఎన్‌వీలో 9, 11 తరగతుల్లో ఏర్పడిన ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాం. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా చేసుకోవాలి. దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే చేసుకోవాలి.

ప్రశ్న: హైదరాబాద్ రీజియన్‌లోని రాష్ట్రాలు ఏవి.. ఎన్ని జేఎన్‌వీలు ఉన్నాయి?

డీసీ: నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ పరిధిలో 77 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. అవి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు, కార్‌నికోబార్, కారైకల్, మాహె, మిడిల్ అండమాన్, మినికాయ్, పుదుచ్చేరి, సౌత్ అండమాన్, యానాం వంటి కేంద్రపాలిత ప్రాంతాలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో కొనసాగుతున్నాయి.

ప్రశ్న: 6వ తరగతి, 9, 11వ తరగతుల ప్రవేశ పరీక్షలను ఎప్పుడు నిర్వహిస్తారు?

డీసీ: జేఎన్‌వీలోని ఆరవ తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18వ తేదీన నిర్వహిస్తాం. అదేవిధంగా 9వ, 11వ తరగతి ఖాళీ భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షను 2025 ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: జేఎన్‌వీలలో ఉన్నత చదువులకోసం కల్పించే శిక్షణ ఎలా ఉంటాయి?

డీసీ: హైదరాబాద్ రీజియన్ పరిధిలో 77 జేఎన్‌వీలు ఉన్నాయి. వీటిల్లో తెలంగాణలోని ఆదిలాబాద్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో అవంతి కోచింగ్ సెంటర్లు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ మేయిన్ ఎగ్జామ్స్‌కి తయారయ్యేటట్లు చేస్తున్నాం. అవంతి కోచింగ్ సెంటర్‌వారే ఐఐటీలో చదివిన ఉపాధ్యాయులను నియమించి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. ఇలాంటి సౌకర్యాలే ఇతర జేఎన్‌వీలలో కూడా కొనసాగుతున్నాయి.

ప్రశ్న: జేఎన్‌వీలలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

డీసీ: జేఎన్‌వీలన్నీ విశాలమైన క్లీన్ అండ్ గ్రీన్‌తో కూడిన ఆహ్లాదపూరితమైన క్యాంపస్‌లతో కూడినవి గా ఏర్పాటు చేశాం. ఇక్కడ చదువుతో పాటు క్రీడలు, ప్రత్యేక గ్రంథాలయం, క్రీడలలో ప్రత్యేక శిక్షణ. అత్యాధునిక ప్రయోగశాలలు, విశాలమైన భోజనశాల, వసతి సౌకర్యం, గ్రీనరీతోకూడిన క్యాంపస్‌లు, పౌష్టిక ఆహారం, సాంస్కృతిక కార్య క్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ వంటి వాటిల్లో కూడా ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నాం.

ప్రతి కుటుంబం వివరాలు సేకరించాలి

- ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన
- మంగంపేటలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభం

పటాన్‌చెరు: జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో గురువారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల (ఎఫ్‌డీసీ) సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్వేను ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన పరిశీలించారు. ప్రతి కుటుంబం వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు ఇస్తామన్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అర్హులకు అందించేందుకు డిజిటల్ కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. సర్వే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో దేవుజా, రేణుక రెడ్డి ఎంపీడీవో అరుణారెడ్డి, తహసీల్దార్, భిక్షపతి, ఎంపీఓ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎఫ్‌డీసీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా గురువారం నిర్వహించిన ఎఫ్‌డీసీ సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





బతుకమ్మలను పేర్చి ఆడుతున్న శిల్పారామం సిబ్బంది, నృత్యం చేస్తున్న కళాకారిణులు

మాదాపూర్: కళాకారుల సాంస్కృతిక నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న డివిజనల్ ఫోక్ ఆర్ట్ ఫెస్టివల్‌లో భాగంగా గురువారం కొమ్మకోయ నృత్యం, గుస్సాడీ, బోనాలు కోలాటం, గిరిజన జానపద నృత్యాలను ప్రదర్శించి అలరించారు. ఎస్‌వీజీ కళావర్షిణి సంధ్యారాణి శిష్య బృందంచే నాట్య నవ దుర్గామృతం, భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం ఎంతగానో అలరించింది. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సందర్శకులతో కోలాటం ఆడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తయారు చేసిన చీరలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

హఫీజ్‌పేట్ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే గాంధీని సత్కరిస్తున్న మదీనాగూడవాసులు

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మదీనాగూడలో సుమారు రూ. 45 లక్షలతో సీసీ రోడ్డు వేసినందుకు గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... హఫీజ్‌పేట్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. స్థానిక నేతలు వినోద్‌రావు, యాదగిరి, వినోద్ గౌడ్, అలీ, అశోక్ గౌడ్, నకుల్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

మియాపూర్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని టీజీ ఆర్టీసీ మియాపూర్-2 డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోందని డిపో మేనేజర్ వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 12వ తేదీ వరకు స్పెషల్ బస్సులను మియాపూర్, కూకట్‌పల్లి, ఎస్‌ఆర్ నగర్, అమీర్‌పేట్ మీదుగా ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి దూర ప్రాంతాలకు స్పెషల్ బస్సులను నడుపుతున్నామన్నారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించని దృష్ట్యా ఎవరికైనా స్పెషల్ బస్సులు కావాలంటే ఆయా విద్యా సంస్థల నుంచి వారి గమ్యస్థానికి బస్సులను నడుపుతామన్నారు. డిపో పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలను ఉపయోగించుకోగలరని కోరారు. వివరాలకు ఫోన్స్: 99592 26420, 80083 36063లలో సంప్రదించాలని డీఎం వెంకటేశం సూచించారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తాం



చందానగర్‌లో సమావేశమైన లయన్స్ క్లబ్ నేతలు

చందానగర్: లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు పేర్కొన్నారు. గురువారం చందానగర్ ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... లయన్స్ సేవల్లో సభ్యుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని అధ్యక్ష, కార్యదర్శిలకు సూచించారు. నాలుగు నెలలుగా క్లబ్‌ల పనితీరుతో పాటు చేసిన సేవ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లయన్స్ రీజియన్ చైర్మన్ కరుణాకర్ గౌడ్, కార్యదర్శి సుధీర్, జోన్ చైర్మన్‌లు కొండ విజయ్‌కుమార్, శేఖర్ గౌడ్, లయన్స్ అధ్యక్ష, కార్యదర్శిలు లక్ష్మీనారాయణ గౌడ్, యాదగిరిగౌడ్, అశోక్ గౌడ్, జనార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయానగర్ కాలనీలో రూ. 17 లక్షలతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు త్వరగా తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, విష్ణు, షౌకత్ అలీమున్నా, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు శేరిలిగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్ఎంటీ హిల్స్‌లో రూ. 25.30 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు , రాంనరేశ్ నగర్ రోడ్డు నంబర్-2లో రూ. 24.70 లక్షలు, రోడ్డు నంబర్-13లో రూ. 25.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు హైదర్‌నగర్ డివిజన్ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, పాత్రికేయ మిత్రులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

సామాజిక స్పృహ గలవారికి అవార్డు

కూకట్‌పల్లి: సమాజ సేవ చేస్తూ సామాజిక స్పృహ గల మేధావికి రూ. 20 వేల నగదు బహుమతి అందిస్తామని ప్రజా ఆలోచనా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు తెలిపారు. యేటా మార్చి 1న ఏ రంగంలో వారినైనా ఎంపిక చేసిన సామాజిక స్పృహ కలిగి సుపరిపాలన, న్యాయ పరిపాలన, ధర్మ పరిపాలన కోసం, ప్రజల కోసం కృషి చేసిన వారికి ఈ ఉగోరా అవార్డుతో గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అవార్డు ఎన్నిక కమిటీ సభ్యులుగా మాజీ కేంద్ర సమాచార కమిషనర్, సీనియర్ జర్నలిస్ట్ మాడభూషి శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ మాజీ సమాచార కమిషనర్, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, ప్రజా ఆలోచనా వేదిక అధ్యక్షుడు విద్య వెంకట్ వ్యవహరిస్తారని తెలిపారు. మరిన్ని ఉగోరా అవార్డు వివరాలను విద్య వెంకట్ త్వరలో ప్రకటిస్తారని పేర్కొన్నారు.

ఆచూకీ, నిందితుల కోసం గాలింపు

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీలోని లోధా అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న ఉదాసీన్ మఠంలోని చెట్ల పొదల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం బుధవారం లభించిన విషయం తెలిసిందే. అయితే మృతురాలు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం అందాపూర్ గ్రామానికి చెందిన మహిళగా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. భర్త నుంచి విడిపోవడంతో జీవనోపాధి కోసం 2 నెలల కిందట నగరానికి వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే పలు పోలీస్ బృందాలు ఆమె ఆచూకీ కోసం, నిందితుల కోసం గాలిస్తున్నారు.